# ఏది పవిత్రత?

## కథ

శనివారం...వేంకటేశ్వర దేవాలయం విపరీతమైన రద్దీగా వుంది. తోసుకుంటూనే లోపలికెళ్ళి కుంకుమ తీసుకుని సంగీత సేవలో కూర్చున్నాను. కీర్తి ఇంకా రాలేదు. అదేంటోగానీ, కీర్తి రాక పోతే కచ్చేరి వెలితిగా వుంటుంది. పూర్తిగా పాడి- కళ్ళు తెరిచాక కళ్ళలోకి చూస్తూ 'మునుపటి కంటే ఈసారి బాగా వచ్చింది' అనో, ఇక్కడ గమకం కొంచెం తప్పిందనో చెబుతుంది. 'నాతో కలిసి పాడొచ్చు కదా' అంటే ''అమ్మో! మీతోనా! గంగాతీర్థంలో అంటునీళ్ళు కలిపినట్టు'' అంటుంది. తనమీద తనకు అపనమ్మకమో, నామీద అనవసరపు గౌరవమో తెలీదు.

గణపతి శ్లోకం తీసుకుని కీర్తన మొదలుపెట్టినా కీర్తి రాలేదు. ఐదు కీర్తనలు పాడి కచ్చేరి పూర్తిచేస్తుండగా దక్షిణామూర్తిగారు వచ్చారు. ఆయన దేవస్థానం కమిటీ చైర్మన్, కీర్తికి మేనమామ. లేచి పాదాలకు నమస్కరించి నవ్వాను. ''దీర్ఘ సుమంగళీ భవ, అభీష్ట సిద్ధిరస్తు'' అన్నారు.

''మొదటిది మీ ఆశీర్వాదంతో ఎలాగూ నిలుస్తుంది. రెండోదే నెరవేరలేదీ రోజు'' అన్నాను. ఇలాంటి కట్ డైలాగ్స్ అంటే ఆయనకు చాలా ఇష్టం.

''లాయర్ బుద్ధి పోనిచ్చుకోవు కదా! ఎప్పుడూ నువ్వే గెలవాలని చూస్తావు''

''మరి మీలాంటి సీనియర్స్ దగ్గర ఆమాత్రం ప్రదర్శించకపోతే మా డిగ్రీ వేస్టయిపోదూ!'' అన్నాను నవ్వుతూ.

ఆయన కూడా పేరు మోసిన లాయరే! అనుభవం మోసిన లాయర్.

''నువ్వు అంచనాలకు అందుతావా? ఇంతకీ ఏ అభీష్టం తీరలేదుట'' చమత్కరించారు.

''ఈరోజు కీర్తి రాలేదు'' చెప్పాను.

''రాకపోతే నువ్వే వెళ్ళు! ఇందులో తీరనంత కష్టం ఏముంది? మీ పిన్ని చక్రపొంగలి కూడా చేసింది'' నవ్వారు.

నాన్నగారి స్నేహితులూ, కుటుంబ శ్రేయోభిలాషి, నన్ను దేవస్థాన గాయనిగా నియమించినది ఆయనే. 'నువ్వు పాడాలంతే!' అన్నారు. పాడుతున్నాను. 'భగవంతుని సన్నిధిని మించిన వేదికేది కళా ప్రదర్శనకు' అంటారాయన. పిన్నిగారు కూడా పరమేశ్వరిలా వుంటారు.

నేను వెళ్ళేసరికి ''ఏమ్మా సీతా! ఎన్నాళ్ళకు ముసలి వాళ్ళం గుర్తొచ్చాం తల్లీ! టీవీలు, సంపాదనలు ఎక్కువైనకొద్దీ మనుషులు దూరమైపోతున్నారు'' నవ్వుతూనే కొంచెం కినుక!

''ఎన్నయినాసరే వచ్చాను కదా! ఇప్పుడు నాకు చక్రపొంగలి పెడుతున్నారు'' అన్నాను కళ్ళలోకే చూస్తూ.

''చెప్పారు! చేసేటప్పుడే అన్నారు! ఈరోజు నాకిష్టమైన వాళ్ళెవరో వస్తున్నారని ఇంత రుచిగా వండానని! రోజా తనకేదో రుచి లేకుండా వండి పెడుతున్నట్టు'' అంది.

''మీరేం చేసినా బావుంటుంది! అవునూ కీర్తి ఏది?'' అడిగాను.

కీర్తి వాళ్ల ఇల్లు, వీళ్ళ ఇల్లు కలిసే వుంటాయి. ఒకే గుమ్మం బయటకు రావడానికీ, లోపలకు వెళ్ళడానికీ! దక్షిణామూర్తిగారి నాన్నగారు కూతురికీ కొడుకుకూ ఇల్లు సమభాగంగా రాసిచ్చారట! ఆ కాలంలోని సమయస్ఫూర్తిని నిజంగా మెచ్చుకోవచ్చు.

''డాబా పైనుంది. ఏవిటో పిచ్చిది! ఎప్పుడూ ఆ మువ్వలు కట్టుకుని కొత్తతాళం, కొత్త పాఠం అంటూ ఏదోటి ప్రాక్టీస్ చేస్తూనే వుంటుంది'' చెప్పింది.

చక్రపొంగలి ప్లేట్ తీసుకుని తింటూనే డాబాపైకి వెళ్ళాను. కీర్తి తదేకంతో 'ఆ లోకమే శ్రీ బాలకృష్ణ' పాటకు చూపుడు వేలిని రెండో చేత్తో పట్టుకుని విడవకుండా అడుగులు కదుపుతోంది. నన్ను చూసి టేప్ ఆపి 'రా సీతక్కా!' అని మువ్వలు తిప్పుకుంటూ కింద కూర్చుంది.

''కొత్త డాన్సా!''

''ఆ! అనుకోవచ్చు! ఎంత చేసినా తృప్తిగా అనిపించడం లేదు''

''గుడికి రాలేదేం? నీకోసం చాలాసేపు ఆగాను పాడకుండా!''

''ఈరోజు పెళ్ళిచూపులు! అందుకే రాలేదు''

''మరి పెళ్ళికూతురిలా వుందేం? అలంకరించుకోకుండా!''

''నాకిష్టం లేదు''

''పెళ్ళిచూపులా? అలంకరణా?''

''రెండూనూ!''

''ఏం?''

''ఇది పన్నెండో పెళ్ళిచూపులు. మొదటి పెళ్ళిచూపులప్పుడు అమ్మాయి అందంగా వుంది. ఉద్యోగం చేస్తోంది కాబట్టి, మా వాడికీ చేదోడుగా వుంటుంది. వంటావార్పు వచ్చుకాబట్టి, మావాడ్ని సుఖపెట్టగలదు. ఇల్లు చక్కబెట్టుకోగలదు. పెద్దలంటే గౌరవం వుంది! అంతా బానే వుందిగానీ, ఇస్తామన్న కట్నం, స్కూటర్ కాకుండా లాంఛనాలకు ఆడబిడ్డ కట్నం పదివేలూ, పది తులాల బంగారం ఇస్తే చాలు! అన్నారు పెళ్ళిచూపులు చూసెళ్ళిన మూడు వారాలకు! ఆ మూడు వారాలు నేనతనితో కన్న కలలు వెంటనే చెరిపేసుకోవాల్సి వచ్చింది. నాన్న ఆర్థిక స్థితి! చెల్లెళ్ళ భవిష్యత్తు, తమ్ముడి చదువు గురించీ!

ఇక రెండో పెళ్ళిచూపులు! మళ్ళీ కలలు! మళ్ళీ గొంతెమ్మ కోరికలు! మళ్ళీ మరచిపోవడాలు! మూడో పెళ్ళిచూపులు..వెళ్ళి ఉత్తరం రాస్తానన్నారు. మళ్ళీ కలల్లో సంసారం! నక్షత్రం కలవలేదని వంకలు! మళ్ళీ మరచిపోవడాలు..ఇలా పన్నెండుమందితో కలల్లో సంసారం చేశాను. ఇక నావల్లకాదు. ఈ కలల సంసారం! అబద్ధపు పెళ్లిసందడి! ఇక నేను పెళ్ళి చూపులకు కూర్చోలేను. అందుకే ఇష్టం లేదంటున్నాను'' వివరించింది.

''అది కాదు కీర్తి! ఇష్టం వున్నా లేకున్నా ఎవరినో ఒకరిని చేసుకునే వరకూ ఇది తప్పదు కదా!''

'' పెళ్ళి చూపులంటే ఏమిటక్కా! ఇద్దర్నీ మానసికంగా సంసారానికి సిద్ధం చేయడమేగా? మరి పెళ్ళినాటికి పెళ్ళి కూతురు కన్యగా, పెళ్ళి కొడుకు పవిత్రంగా ఎలా వుంటారు? అంతకుముందు పెళ్ళి చూపులలో ఒకరితో ఒకరు జీవితాలను ఊహించేసుకుని కలల్లో కాపురం చేశాక! మనసు వ్యభిచారం చేసినట్టేగా! అది అపవిత్రం అయ్యాక శరీరం ఎంత స్వచ్ఛంగా వున్నా ఏం లాభం?'' ఆవేశం తన్నుకొచ్చింది.

''అయితే ఏమంటావిప్పుడు?'' ఇంకా రెచ్చగొట్టాను.

''నాకంటూ నచ్చాక, నన్ను చేసుకుంటాడనీ నమ్మకం కుదిరాక అప్పుడే పెళ్ళి చూపులు! అప్పుడే నా కలల్లోకి రానిస్తాను. ఇలా మధ్యలో వచ్చేపోయే వాళ్ళ ముందు నేను కూర్చోను'' దృఢంగానే అంది.

అనవసరంగా ఉద్రేకపడుతుందనుకున్నాను. కానీ, అనుభవిస్తేగాని, ఆ బాధ తెలీదేమో! వచ్చిన ప్రతీవాడు చేసుకుంటాడనే ఆశతో కలల్లో తేలిపోవడం..వాళ్ళు వద్దనేసరికి అతన్ని మనసులోంచి తీసేయడం! నిజంగా ఆ అమ్మాయి అన్నట్టు ఇది మానసిక వ్యభిచారమా? మరి డబ్బు కోసం కాసేపు శరీరాన్ని అమ్ముకోడానికి, జీవితం కోసం కాసేపు మనసులో స్థానం ఇవ్వడానికీ తేడా ఏంటి? అసలు మొదటిదే తొందరగా వదిలించుకోవచ్చేమో! రెండోదే బాధాకరం! రాను రాను వ్యభిచారంలో శరీరం స్పందన కోల్పోయినట్టే, ఇక్కడ మనసు కూడా స్పందన కోల్పోతుందేమో! ఒకవేళ అదే జరిగితే జీవితానికి ఎంత దెబ్బ! మగాళ్ళంటే నిర్లిప్తత! ఈ నిర్లిప్తత దాంపత్య జీవితం మీద దెబ్బతీయదా?


ఐదారు నెలలు ఆ విషయం మరచిపోయాం ఇద్దరం! ఓరోజు అనుకోకుండా ఓ అబ్బాయిని తీసుకొచ్చి పరిచయం చేసింది కీర్తి.

''ఇతను సూర్య..మా ఆఫీస్‌లోనే అకౌంటెంట్'' అంది. ఇది నాకు మామూలే! ఎప్పుడయినా తెలిసిన

నాన్నలతో చెప్పాలనిపించింది. ఆలోచిస్తే సమస్యను ఇంకా జటిలం చేసిన దాన్నవుతానేమోనని అనిపించింది. అందుకే మౌనమైపోయాను.

★★★

శనివారం కచేరీ తరువాత తీర్థం ఇస్తూ పూజారిగారు అన్నారు..



వాళ్లు గుడికి వస్తే పరిచయం చేయడం..నేను తప్పించుకోవడం! చిన్నగా నవ్వి 'హలో' అని మెల్లగా తప్పుకున్నాను. పది నిముషాల తరువాత వచ్చింది కీర్తి..

''అతనెలా వున్నాడక్కా!'' అంటూ.

''ఎలా వుంటే మనకెందుకు?''

''పెళ్లి చేసుకోబోయేవాడ్ని ఎలా వున్నాడని శ్రేయోభిలాషులను అడక్కుండా ఎలా వుంటాను. అందులోనూ నిన్ను?'' అంది.

''పెళ్ళి చేసుకోబోతున్నావా అతన్ని'' ఆశ్చర్యం వేసింది.

''అవును...ఇద్దరం నిర్ణయించుకున్నాం'' మెల్లగా చెప్పింది.

''మీ కులస్థుడేనా?''

''కాదు''

''మీవాళ్ళ ఛాందసం, పట్టింపులు తెలిసీ...తొందర పడుతున్నావేమో!''

''లేదక్కా! ఇప్పటికే ఆలస్యం చేశాను''

''మీవాళ్ళు ఒప్పుకోకపోతే'' అనుమానం...

''ఏమవుతుంది? పెళ్ళి చేసుకునేది మేమిద్దరం!''

''మీ పెళ్ళి జరక్కుండా అడ్డుకుంటే''

''వేరే చోటికి వెళ్ళి పెళ్ళి చేసుకుంటాం'' స్థిరంగా పలికింది.

''దాన్నేమంటారో తెలుసా?'' ఇంకా రెట్టించి అడిగాను.

''తెలుసు. లేచిపోవడం అంటారు''

''మరి నువ్వు?''

''ఏం..ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా, బేరం సరీగ్గా కుదిరి, నాలో నాణ్యత మీద నమ్మకం కలిగి, సంసారానికి సంపాదనకు పనికొస్తుందని నిర్ణయించుకుని, అన్నివిధాలా నచ్చాక కూడా లాంఛనాల దగ్గర దెప్పిపొడిచి నాన్నను నిలువెల్లా దోచుకుని అక్కను తీసుకెళ్ళారు కదా! అక్క సంసారం సుఖంగా వుందా? పెళ్ళయి ఐదేళ్ళయినా ప్రతీ పండక్కి కాలితో తన్నిన బంతిలా వచ్చి నాన్న దగ్గరనుంచి ఏదోటి తీసుకొస్తేనే రమ్మనే మొగుడుతో అక్క సుఖమైన జీవితం గడుపుతుందా? మరి అది గోత్రాలు, నక్షత్రాలు, జాతకాలు కలిసిన సంబంధమేగా? అందరూ ఇష్టపడి అక్షింతలతో 'సుఖీభవ' అని ఆశీర్వదించిన సంసారమేగా? మరి ఆ ఆశీర్వచనాలెటుపోయాయి? ఇద్దరికీ క్షణం పడదు! ఎప్పుడూ అసంతృప్తే! అదేనా అందరు ఒప్పుకున్న సుఖీభవ!

మేమిద్దరం ఇష్టపడ్డాం! ఇద్దరం సంపాదిస్తున్నాం! ఇద్దరికీ ఒకరంటే ఒకరికి గౌరవం, ప్రేమ వున్నాయి. అభిరుచులు, ఆశయాలు కలిశాయి. మా పెళ్ళికి ఖర్చు లేదు, ఆర్భాటం లేదు. నాన్నను దోపిడీ చేసి బికారిగా మార్చడం లేదు. సుఖమైన జీవితానికి రమ్మని అతను తన చిటికెన వేలు అందిస్తే, నిశ్శబ్దంగా అందరికీ వీడ్కోలు చెప్పి, ఏ అట్టహాసం లేకుండా ప్రశాంతంగా సముద్రంలో లీనమవడానికి వెళ్ళే నదిలా అతన్ని చేసుకోవడం లేచిపోవడమనుకుంటే 'నేను లేచిపోతానక్కా గర్వంగా' అంది.

నాకా మాటలు జీర్ణం కాలేదు. ఇంటికెళ్ళి వాళ్ళమ్మా ''కీర్తి ఇక రాదమ్మా! ఆ పిల్ల ఒకబ్బాయితో లేచిపోయింది'' అని.

ఎందుకో ఆ పదం నచ్చలేదు నాకు. కానీ, దానికదే పదం. వేరే పదం కనిపెడితే బావుండు ఎవరయినా! రుక్మిణి కృష్ణుడితో వెళ్ళిపోయి వివాహం చేసుకోలేదా? మరి ఆ సంబంధం పవిత్రమైందేగా! వీళ్ళూ ఇంట్లోంచి వెళ్ళిపోయి పెళ్ళే చేసుకున్నారుగా. వితండవాదం వద్దు! అన్నీ ఒప్పేసుకోవడమే సమాజానికి హద్దు..ముద్దు! లేకపోతే సంప్రదాయాలే రద్దు! ఇంతకంటే ఆలోచించడానికి మెదడు అంగీకరించలేదు. యుగాల తరబడి ఈ సంకెళ్ళలో బందీలైనవాళ్ళం మరి. యాసిడ్‌తో కడిగినా మెదళ్ళ మురికిపోదు! ఎక్కువగా మన అభిప్రాయాలను వెల్లడిస్తే పిచ్చివాళ్ళకిందో, మూర్ఖులకిందో జమకట్టేసి వాళ్ళు మాత్రం 'పవిత్రత' ప్రదర్శిస్తుంటారు. అందుకే సమాజంలో పెదవులతో పదాలను ఎక్కువగా వాడకూడదు. కళ్ళతో చూస్తూ మెదడుతో చేస్తూ పోవాలంతే!

☆

**శ్రీలత**